# లెక్కింపు కేంద్రాలు ఖరారు..!

### పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ) : శాసన సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణతో పాటు డిసెంబర్ 3న జరిగే కౌంటింగ్‌కు సంబంధించి పక్కా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు గ్రేటర్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఖరారు చేశారు. హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 14 లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మిగిలిన 13 నియోజకవర్గాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఒకే చోట లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా, కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

### నిఘా నీడలో కౌంటింగ్ కేంద్రాలు..

నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు నమోదైన ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కింపు కేంద్రాలకు తరలించేలా ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. తరలించిన అనంతరం నిరంతరం సీసీ కెమెరాల నిఘా నడుమ.. భద్రత సిబ్బంది ఉండేలా ప్రణాళిక రూపొందించారు. డిసెంబర్ 3న లెక్కింపు చేపట్టనున్నారు. ఆ రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో బారికేడ్లు అమర్చుతున్నారు. నియోజకవర్గాల వారీగా ఓట్లు లెక్కించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు బయట, లోపల లైవ్ కెమెరాలు బిగిస్తున్నారు. ఈ నిఘా కెమెరాల నడుమ ఓట్లు లెక్కించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా.. రాజకీయ నాయకుల సమక్షంలో లెక్కింపు జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి గొడవలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన భద్రత నడుమ లెక్కింపు చేపట్టడానికి ఎన్నికల అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.



| నియోజకవర్గం | లెక్కింపు కేంద్రాలు |
|---|---|
| **హైదరాబాద్ జిల్లా** | |
| 1. ముషీరాబాద్ | దోమలగూడ, ఏవీ కాలేజీ |
| 2. మలక్‌పేట | అంబర్‌పేట, ఇండోర్ స్టేడియం |
| 3. అంబర్‌పేట | నారాయణగూడ, ఆర్‌బీ వెంకట్రామ రెడ్డి మహిళా కళాశాల |
| 4. ఖైరతాబాద్ | కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ |
| 5. జూబ్లీహిల్స్ | యూసుఫ్‌గూడ, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం |
| 6. సనత్‌నగర్ | ఓయూ, కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రాంగణం |
| 7. నాంపల్లి | మాసబ్‌ట్యాంక్, జేఎన్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ |
| 8. కార్వాన్ | మాసబ్‌ట్యాంక్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల |
| 9. గోషామహల్ | కోఠి, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం |
| 10. చార్మినార్ | నాంపల్లి, కమల నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీ ఆఫ్ ఉమెన్ |
| 11. చాంద్రాయణగుట్ట | బషీర్‌బాగ్, నిజాం కళాశాల |
| 12. యాకుత్‌పురా | నాంపల్లి, సరోజినీ నాయుడు వనితా మహా విద్యాలయ |
| 13. బహదూర్‌పురా | బండ్లగూడ, ఆరోరా లీగల్ సైన్స్ అకాడమి |
| 14. సికింద్రాబాద్ | ఓయూ, ప్రొ.జి. రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యూకేషన్ స్టడీ సెంటర్ |
| 15. సికింద్రాబాద్ (కంటోన్మెంట్) | ఆనంద్ టాకీస్ ఎదురుగా, సీఎస్ఐ ఇనిస్టిట్యూట్ |
| **రంగారెడ్డి జిల్లా** | |
| 16. ఎల్బీనగర్ | సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం |
| 17. మహేశ్వరం | సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ (గ్రౌండ్ ఫ్లోర్) |
| 18. రాజేంద్రనగర్ | హిమాయత్‌నగర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాల |
| 19. శేరిలింగంపల్లి | జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం |
| **మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా** | |
| 20. మల్కాజిగిరి | బోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్ ఎంబీఏ బ్లాక్ |
| 21. కుత్బుల్లాపూర్ | బోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్ సెమినార్ హాల్ (కొత్త భవనం) |
| 22. కూకట్‌పల్లి | బోగారం హోలిమేరీ ఇనిస్టిట్యూట్, ఇంజినీరింగ్ బ్లాక్ |
| 23. ఉప్పల్ | బోగారం, హోలిమేరీ ఇనిస్టిట్యూట్ ఎంబీఏ బ్లాక్ |
| 24. మేడ్చల్ | బోగారం, హోలిమేరీ ఇనిస్టిట్యూట్ ఎంబీఏ బ్లాక్ |



### ఓటు హక్కును వినియోగించుకున్న హైదరాబాద్ సీపీ

పోస్టల్ బ్యాలెట్ ద్వారా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య బుధవారం అంబర్‌పేటలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

*- సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ)*

## ఆమెకు కొండంత అండగా రాచకొండ షీ టీమ్స్



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్

### డీసీపీ, ఉషా విశ్వనాథ్

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు రాచకొండ షీ టీమ్స్‌కు వచ్చిన 224 ఫిర్యాదులలో 218 మంది ఆకతాయిలను అరెస్ట్ చేశామని రాచకొండ షీ టీమ్స్ డీసీపీ ఉషా విశ్వనాథ్ తెలిపారు. పట్టుబడ్డ వారికి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. వేధింపులపై మౌనం వీడాలని, షీ టీమ్స్ కొండంత అండగా ఉంటాయన్నారు. షీ టీమ్స్‌కు నేరుగా ఫిర్యాదులు రావడంతోపాటు డెకాయి ఆపరేషన్లు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేశామన్నారు. పట్టుబడిన వారికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. మహిళలను వేధిస్తే వెంటనే షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని, మీకు అండగా మేము ఉంటామని డీసీపీ సూచించారు. ఈ సమావేశంలో ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్సై రాజు, కౌన్సిలర్లు శాంతి ప్రియ, రమ్యా, శ్యామల గౌరి తదితరులు పాల్గొన్నారు.

### కొన్ని ప్రధాన ఘటనలు..

- సవితి తండ్రి కాలయముడై 13 ఏండ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. హాస్టల్‌లో ఉన్న బాలికను ఇంటికి తీసికెళ్లుందుకు నిందితుడు ప్రిన్సిపాల్ అనుమతి కోరాడు. అతడితో వెళ్లనంటూ బాలిక నిరాకరించింది. ప్రిన్సిపాల్ ఆరా తీయడంతో బాధితురాలు అసలు విషయం వెల్లడించింది. తన తండ్రి చిన్నప్పుడు చనిపోయాడని, తల్లి మరో పెండ్లి చేసుకుందని చెప్పింది. గతేడాది తల్లి కూడా చనిపోయిందని, ఆ తరువాత సవితి తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్టు బాలిక చెప్పింది. హాస్టల్‌లో చదువుతున్న బాలికను దసరా సెలువుల్లో ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తిరిగి హాస్టల్‌కు వెళ్లకుండా కట్టడి చేశాడు. ఇరుగుపొరుగు సహాయంతో బాలిక హాస్టల్‌కు వెళ్లింది. బాధితురాలు వనస్థలిపురం షీ టీమ్స్‌ను ఆశ్రయించడంతో, అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణాలో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.
- ఇన్‌స్టాగ్రామ్‌లో సందేశాలు పంపి, ఆ తరువాత బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుడిపై చౌటుప్పల్‌లో, మరో ఘటనలో చైతన్యపురిలో కేసులు నమోదు చేశారు. అలాగే, సరూర్‌నగర్‌లో ఉండే బాలికకు స్నాప్‌చాట్‌లో పరిచయమై, ప్రేమ పేరుతో ఆమెను లోబర్చుకొని ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతుండటంతో సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. టెలిగ్రామ్‌లో బీటెక్ విద్యార్థినికి పరిచయమైన నిందితుడు.. ఆమెకు ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మించి, ఫొటోలు తీసి వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై..

### సంతోష్‌నగర్‌లో కేసు నమోదు

మాదన్నపేట, నవంబర్ 22: ఇన్‌స్పెక్టర్ పట్ల దురుసుగా మాట్లాడిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై సంతోష్‌నగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంఐఎం పార్టీ ప్రచారంలో భాగంగా సభ ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం సమయం గడిచి పోతుందంటూ సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర సభ నిర్వాహకులకు సమాచారం ఇచ్చాడు. సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఇన్‌స్పెక్టర్‌పై దురుసుగా మాట్లాడాడు. దీంతో ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌పై సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు.

## చేతి తొడుగులతో చెక్‌పోస్టుల వద్ద పోలీసు తనిఖీలు

### రాచకొండ సీపీ డీఎస్. చౌహాన్



సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): చెక్‌పోస్టుల వద్ద పోలీసులు చేతి తొడుగులతో తనిఖీలు చేపడుతారని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో భాగంగా పోలీసులు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపడుతున్నారని, సామాన్య ప్రజలు వివాహాలు, ఇతర శుభకార్యాలకు వెళ్తూ సంబంధింత సామగ్రితో వెళ్తున్నారన్నారు. ఈ సమయంలో తనిఖీలు చేయడంతో శుభకార్యాలయాలకు ఉపయోగించే వస్తువులను కూడా తనిఖీ చేయాల్సి వస్తుందని, దీనిపై ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాల దృష్ట్యా, తనిఖీలలో పాల్గొనే సిబ్బంది తమ చేతికి తొడుగు (గ్లౌస్) వేసుకొని తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ మేరకు పోలీసులకు చేతి తొడుగులు అందజేసినట్లు సీపీ వెల్లడించారు.

## జిల్లాలో కొనసాగుతున్న తనిఖీలు

### రూ. మూడు లక్షల నగదు సీజ్

సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ ) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. బుధవారం ఒక్కరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.మూడు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు రూ.4,02,03,450 నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ తెలిపారు. దీంతోపాటు పోలీస్ అథారిటీ ద్వారా మొత్తం రూ. 61,25 కోట్ల నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు. 813 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. 3902 నక్కాస్ ఆపరేషన్స్, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద బహదూర్‌పురలో రెండు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. వాహనాల దుర్వినియోగంలో సనత్‌నగర్ ఒక కేసు, గోషామహల్‌లో ఒక కేసు నమోదు చేశామన్నారు.

## రూ.98 లక్షల నగదు పట్టివేత



అబిడ్స్, నవంబర్ 22: ఎన్నికల నేపథ్యంలో అవంతిబాయ్ విగ్రహం వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో రెడ్‌హిల్స్‌కు చెందిన రిజ్వాన్ వద్ద నుంచి షాహినాయత్‌గంజ్ పోలీసులు రూ.98 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, అడ్మిన్ ఎస్ఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

## టీహబ్‌ను సందర్శించిన.. మేఘాలయ శాసనసభ్యులు, అధికారుల బృందం



సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): సరికొత్త ఆవిష్కరణలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన టీ హబ్‌ను దేశ, విదేశాల్లోని వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ఆయా రాష్ట్రాల ప్రభుత్వ బృందాలు ప్రత్యేకంగా సందర్శిస్తున్నాయి. మంగళవారం మేఘాలయకు చెందిన శాసనసభ్యులు, అధికారుల బృందం టీ హబ్‌లోని స్టార్టప్‌ల కార్యకలాపాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రతినిధుల బృందంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ప్రత్యేకంగా సమావేశమై టీ హబ్ కార్యకలాపాలను వివరించారు.